
సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం • 3 • మే • 2024


సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గిరిజన జాతర

- 'ఆసిఫాబాద్' సభకు తరలివచ్చిన ప్రజలు
- కుమురంభీం, రాంజీగోండులను స్మరిస్తూ ఉత్సాహం నింపిన సీఎం
- ఆదివాసీ బిడ్డ సుగుణను గెలిపించాలని పిలుపు
- ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు హామీ
- రేవంత్‌రెడ్డి పర్యటనతో కాంగ్రెస్‌లో జోష్

ఆసిఫాబాద్: గిరిజన పోరాట వీరులు కుమురంభీం, రాంజీగోండులను స్మరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నింపింది. మండుతున్న ఎండల్లోనూ జనజాతర సభకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్స్ పక్కన ఖాళీ స్థలంలో గురువారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అధ్యక్షతన నిర్వహించిన జనజాతర బహిరంగ సభ విజయవంతమైంది. వారం రోజుల నుంచి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జిల్లా నాయకులతో కలిసి జనసమీకరణ చేపట్టారు. సభ ప్రారంభంలో ప్రాంగణం ఖాళీగా కనిపించినప్పటికీ చివరకు కుర్చీలు పూర్తిగా నిండిపోయాయి. ఖాళీగా ఉన్న కుర్చీల్లోకి ప్రజలను అనుమతించాలని డీసీసీ అధ్యక్షుడు పలుసార్లు పోలీసులను కోరడం కనిపించింది. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. సభకు వచ్చిన వారిని అడుగడుగునా తనిఖీ చేశారు.

మరాఠీ పాటలు.. ప్రసంగాలు

జనజాతర సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం మూడు గంటలకు వస్తారని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 4 గంటలకు ఆయన ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా బహిరంగ సభ వేదిక వద్దకు వచ్చారు. ముఖ్యమంత్రి రాక ఆలస్యం కావడంతో అప్పటివరకు కళాకారులు మరాఠీ పాటలు, నృత్యాలతో అలరించారు. ఉమ్మడి జిల్లా నాయకులతోపాటు ఆదివాసీ, దళిత సంఘాల నాయకులు ప్రసంగించారు. కొంతమంది నేతలు మరాఠీలో ప్రసంగించగా.. మరికొందరు తెలుగులో మాట్లాడారు. సీఎం రాక ముందే డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి జాదవ్ నరేశ్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ ప్రసంగించారు. సభావేదిక పైకి చేరుకోగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్టేజీని ఆనుకుని ఏర్పాటు చేసిన ర్యాంపుపై తిరుగుతూ ప్రజలు, కార్యకర్తలకు అభివాదం చేశారు.


సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

సంక్షేమం.. విమర్శలు

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రసంగం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తొలుత అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించిన ఆయన.. ఆ తర్వాత బీజేపీ, బీఆర్‌ఎస్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. దాదాపు 25 నిమిషాల పాటు ముఖ్యమంత్రి ప్రసంగం కొనసాగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 'ఇక్కడ సాగు నీరు, పోడు భూముల సమస్య ఉంది. ఈ ప్రాంతంలోని ప్రాజెక్టులు ఏళ్ల క్రితం మంజూరైనప్పటికీ.. ప్రాజెక్టుల్లో నీరున్నప్పటికీ సాగుకు ఉపయోగపడటం లేదు. లక్షన్నర ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉన్నా గత పాలకుల నిర్లక్ష్యంతో సాగు నీరందడం లేదు' అంటూ విమర్శించారు. కుమురం భీం ప్రాజెక్టు పూర్తయినా, కాల్వల నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు. ఏళ్లుగా ఆసిఫాబాద్ మండలంలోని గుండి బ్రిడ్జి అసంపూర్తిగా ఉందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఇస్తామని హామీ ఇచ్చారు. 'సీసీఐ పరిశ్రమ మూతపడిందని, ఈ ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమ వస్తే అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల రద్దుకు ప్రయత్నిస్తున్న బీజేపీని రద్దు చేయాలని పిలుపునిచ్చారు. అక్రమంగా కేసులు పెట్టారని.. కుమురంభీం, రాంజీగోండు స్ఫూర్తిగా పోరాడుతామని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు ఉండాలి.. పోడు భూముల పట్టాలు అందాలంటే ఆత్రం సుగుణ గెలవాలని కోరారు. ఈ సందర్భంగా 'బీజేపీ ఏమిచ్చిందంటే గాడిద గుడ్డు ఇచ్చింది అని.. ఆత్రం సుగుణకు లక్ష మెజార్టీ అంటే పక్కా' అని ప్రజలతో అనిపించి ప్రసంగం ముగించారు. సమావేశంలో మాజీ మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రేవంత్‌రెడ్డికి కుమురంభీం ఫొటో ఇస్తున్న సీతక్క, ఆత్రం సుగుణ, తదితరులు

కొంగు చాపి అడుగుతున్నా..



కొంగుచాపి అడుగుతున్న ఒక్క అవకాశం ఇవ్వండి.. ఆదరించి గెలిపించండి. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం. 75 సంవత్సరాల చరిత్రలో ఆదివాసీ మహిళకు ఏ పార్టీ అవకాశం ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చింది. ఆదివాసీ బిడ్డను గెలిపించాలి. ఆదిలాబాద్ ఎంపీ స్థానం రాహుల్ గాంధీకి గిఫ్ట్ ఇవ్వాలి. అభివృద్ధి పనులు, ఆరు గ్యారంటీలను చూసి ఓటేయండి.

– ఆత్రం సుగుణ,
ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా



జిల్లాలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా. కేంద్రంలో అధికారం ఇవ్వండి. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా. ప్రాజెక్టులు, రోడ్ల అభివృద్ధితోపాటు ఆరె కులస్తులు, మాలి కులస్తుల సమస్యలు పరిష్కరించి అన్నివర్గాల సంక్షేమానికి పాటు పడతా. మహిళలకు వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ప్రజల ఆశలను నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీయే.

– సీతక్క, ఉమ్మడి జిల్లా మంత్రి

రిజర్వేషన్ల రద్దుకు కుట్ర



ప్రధాని నరేంద్ర మోదీ ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ ఆదివాసీ దేవుళ్లను ఎప్పుడూ పూజించడు. గతంలో ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా పని చేసిన నగేశ్ ప్రజలకు చేసిందేమీ లేదు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కూడా అదే బాటలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాన్యురాలైన ఆదివాసీ మహిళ ఆత్రం సుగుణకు టికెట్ కేటాయించింది. అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

– వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

రిమ్స్ ఘటనపై విచారణ

- 'స్ట్రెచర్‌పైనే ఐదున్నర గంటలు' వార్తాకథనానికి స్పందన
- ఘటనపై ఆరా తీసిన కలెక్టర్
- ప్రొఫెసర్ల కమిటీతో విచారణ చేయిస్తామన్న రిమ్స్ డైరెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, ఆదిలాబాద్: రిమ్స్‌లో వైద్యం అందక గిరిజన మహిళను ఆమె బంధువులు ఇంటికి తీసుకెళ్లడం.. ఆ తర్వాత ఆమె మృతిచెందిన ఘటనపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. 'స్ట్రెచర్‌పైనే.. ఐదున్నర గంటలు!' శీర్షికన గురువారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తాకథనానికి కలెక్టర్ రాజర్షిషా స్పందించారు. రిమ్స్ డైరెక్టర్ ద్వారా వివరాలు ఆరా తీశారు. కాగా, ఈ మొత్తం ఘటనపై ముగ్గురు ప్రొఫెసర్లతో విచారణ కమిటీని నియమించినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ 'సాక్షి'కి తెలిపారు. ప్రస్తుతం ప్రాథమిక దర్యాప్తు చేస్తున్నామని, ఆ తర్వాత పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని పేర్కొన్నారు.

'రిమ్స్‌లో పట్టించుకోలేదు'

వైద్యం కోసం తన తల్లి ఆత్రం లక్ష్మీబాయిని రిమ్స్‌కు తీసుకెళ్తే ఎవరూ పట్టించుకోలేదని ఆమె కుమారుడు ఆత్రం న్యానోబా 'సాక్షి'తో గురువారం ఫోన్‌లో తెలిపాడు. తన తల్లి గర్భకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతోందని పేర్కొన్నాడు. దీంతో బుధవారం సాయంత్రం ఉట్నూర్ ఆస్పత్రికి తీసుకెళ్లామని తెలిపాడు. అక్కడి సిబ్బంది చికిత్స చేయలేమని చెప్పగా ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నాడు. అంబులెన్స్ ద్వారా రాత్రి రిమ్స్ ఆస్పత్రికి చేరుకున్నా వారు అడ్మిట్ చేసుకోలేదని తెలిపాడు. దీంతో తన తల్లిని రాత్రంతా స్ట్రెచర్‌పైనే ఉంచాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయాడు. దిక్కుతోచని స్థితిలో గురువారం తెల్లవారుజామున తాము చిన్నగూడకు తీసుకురాగా కొద్దిసేపటికే ఆమె మృతిచెందినట్లు తెలిపాడు. కాగా, శ్యాంపూర్ ఆస్పత్రి సిబ్బంది గురువారం ఇంటికి వచ్చి తన తల్లి లక్ష్మీబాయి మృతి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు వివరించాడు.


స్ట్రెచర్‌పైనే.. ఐదున్నర గంటలు!

గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

అసమ్మతి నేతలపై సస్పెన్షన్ కొనసాగింపు!

- ప్రచారం చేస్తున్న 'కంది' వర్గీయులు
- తప్పుడు ప్రచారమన్న ఆ ముగ్గురు
- అయోమయంలో కాంగ్రెస్ శ్రేణులు

కైలాస్‌నగర్: అసమ్మతి నాయకులు పార్టీలో చేరిక వ్యవహారం కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి ఇటీవల టీపీసీసీ వర్కింగ్ కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. అయితే వీరి రాకను ముందునుంచే వ్యతిరేకిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి వర్గీయులు పార్టీలో చేరిన వెంటనే ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్రంలో వారి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు దహనం చేశారు. నోటికి నల్లగుడ్డలు ధరించి ధర్నా చేశారు. వారిపై సస్పెన్షన్‌ను కొనసాగించకుంటే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని ప్రకటించారు. కాగా, సంజీవ్‌రెడ్డి, సుజాత, సాజిద్‌ఖాన్ చేరికను పార్టీ రాష్ట్ర నాయకత్వం నిలిపివేసిందని, వారి బహిష్కరణను ఎత్తివేయలేదంటూ 'కంది' వర్గం నాయకులు ప్రచారం చేస్తుండటం పార్టీలో తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని దక్కించుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేద్దామని, మంత్రి సీతక్క నాయకత్వంలో ఆత్రం సుగుణను గెలిపిద్దామంటూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేలా కంది శ్రీనివాసరెడ్డి పేరిట ఆయన వర్గీయులకు పంపించిన వాట్సాప్ సందేశం వైరల్‌గా మారింది. అయితే ఇది వాస్తవమని తెలిపేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. పార్టీ అధిష్టానం నుంచి వారి సస్పెన్షన్ కొనసాగింపుపై ఎలాంటి ప్రకటన, ఉత్తర్వులు వెలువడలేదు. ఇటీవల భార్గవ్ దేశ్‌పాండే సస్పెన్షన్ ఎత్తివేత, కొనసాగింపుపై పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు అందాయి. కానీ, ప్రస్తుతం ఈ నాయకుల విషయంలో అలాంటి అధికారిక ఉత్తర్వులు రాలేదు. దీంతో 'కంది' వర్గీయులతో పాటు తటస్థంగా ఉన్న పార్టీ శ్రేణుల్లోనూ అయోమయం నెలకొంది. కాగా, 'కంది' వర్గం చేస్తున్న ప్రచారాన్ని ఆ ముగ్గురు నాయకులు కొట్టి పారేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆ నాయకులను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా తాము తిరిగి పార్టీలో చేరిన మాట వాస్తవమని, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని కూడా కలిసి నియోజకవర్గ పరిస్థితులు వివరించామని చెప్పారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు చేరుకుని పార్టీ అభ్యర్థికి మద్దతుగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలోకి దిగుతామని చెప్పారు. ఇలా ఇరువర్గాల నాయకులు చేసుకుంటున్న ప్రచారంలో వాస్తవం తెలియక కార్యకర్తలు, నాయకులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి లేదా పార్టీ రాష్ట్ర నాయకత్వం దీనిపై ఏదైనా అధికారిక ప్రకటన చేస్తే గాని ఈ వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పడేలా లేదని పలువురు నాయకులు చెబుతుండడం కాంగ్రెస్ నాయకుల మధ్య వైరానికి నిదర్శనంగా నిలుస్తోంది.

అధిష్టానం నిర్ణయమే ఫైనల్: సీతక్క

'కంది' వర్గీయుల ప్రచారంపై ఆసిఫాబాద్‌లో మీడియా ప్రతినిధులు మంత్రి సీతక్కను ప్రశ్నించారు. దీంతో ఆమె స్పందిస్తూ.. 'గాంధీభవన్‌లో కండువాలు కప్పుకొని కాంగ్రెస్‌లో చేరిన నాయకులు పార్టీలోనే ఉన్నారని తెలిపారు. పార్టీ బలహీనంగా ఉన్న చోట చేరికలను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే అంతర్గతంగా పరిష్కరించుకోవాలని నాయకులకు సూచించారు.

'పోస్టల్' ఓటుకు వేళాయె..

- నేటి నుంచి 8వ తేదీ వరకు అవకాశం
- ఓటేయనున్న 15వేల మంది ఉద్యోగులు
- హోం పోలింగ్‌కు 1,583 దరఖాస్తులు
- ఏడు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు హక్కు ముందుగానే వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ నెల 3నుంచి 8వ తేదీ వరకు వారు ఓటు హక్కు సద్వినియోగం చేసుకునే అవకాశం కల్పించింది. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏడు ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లకు తావివ్వకుండా ప్రతీ ఉద్యోగ, ఉపాధ్యాయుడు తమ నియోజకవర్గ పరిధిలోనే ఓటు వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మొదటి విడతగా నిర్వహించిన శిక్షణలోనే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఓటు హక్కు కల్పించారు. ఒక జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలోని నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారికి ప్రత్యేకంగా ఒక రోజు సెలవు ప్రకటించారు.

వందశాతం నమోదయ్యేలా..

పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తలెత్తిన పొరపాట్లకు ఏమాత్రం తావివ్వకుండా ఎన్నికల కమిషన్ ఈ సారి ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగులే దరఖాస్తు చేసుకునేవారు. అవగాహన రాహిత్యం, తమకెందుకనే భావనతో కొందరు దరఖాస్తు చేసుకునేవారు కాదు. దరఖాస్తు చేసుకున్నా పోస్టల్ బ్యాలెట్ రాక ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చాలామంది ఓటు హక్కు కోల్పోయారు. వారు ఆందోళన కూడా చేపట్టారు. వీటన్నిటినీ గుర్తించిన ఎన్నికల కమిషన్ ఈసారి ఎన్నికల శిక్షణకు ముందే ట్రెయినింగ్ ఆర్డర్ కాపీతో పాటు ఉద్యోగుల వివరాలతో కూడిన ఫారం 12ను అందజేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 15,293 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. వీరికి శిక్షణ సమయంలో 12 డీ ఫారంతో పాటు ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ ప్రతిని జత చేసి వారు ఏ నియోజకవర్గ పరిధిలో ఓటు వేయాలనుకుంటున్నారనే విషయాన్ని తెలియజేసేలా సమాచారాన్ని సేకరించారు. దీని ద్వారా పోస్టల్ బ్యాలెట్ జారీ చేయనుండటంతో ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగి వారి నియోజవర్గాల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశమేర్పడింది.


పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకుంటున్న ఉద్యోగులు (ఫైల్)

ప్రత్యేక ఏర్పాట్ల మధ్య..

పోస్టల్ బ్యాలెట్‌ను ఈ నెల 3నుంచి 8వ తేదీ వరకు వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కంపార్టుమెంట్‌తో పాటు పోలింగ్ సిబ్బందిని నియమించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు భద్రత సిబ్బందిని కేటాయించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ వీలును బట్టి ఆయా తేదీల్లో ఉదయం 9నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎక్కడ ఓటు హక్కు ఉందో అదే నియోజకవర్గ పరిధిలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు వినియోగించుకోవచ్చు.

హోం పోలింగ్‌కు ఏర్పాట్లు

85 ఏళ్ల వయస్సు పైబడిన వయోవృద్ధులు, 40శాతానికి మించి వైకల్యమున్న దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేలా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఇందుకోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 85ఏళ్ల వయస్సుపైబడిన వారు 8,548 మంది ఉండగా, 40శాతం కంటే అధిక వైకల్యం కలిగిన దివ్యాంగులు 25,704 మంది ఉన్నారు. ఈసీ ఆదేశాల మేరకు వీరందరికీ బీఎల్వోల ద్వారా 12డీ ఫారాలు అందజేశారు. కానీ.. చాలామంది ఇంటి వద్ద ఓటు వేసేందుకు ఆసక్తి చూపలేదు. పార్లమెంట్ వ్యాప్తంగా 1,583 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. వీరిలో వయో వృద్ధులు 730 మంది, దివ్యాంగులు 853 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరు ఓటు నమోదు చేసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బంది, పోలీస్ కానిస్టేబుల్, ఓ వీడియోగ్రాఫర్ వారి ఇళ్లవద్దకే వెళ్లి వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ద్వారా ఓటు నమోదు చేయనున్నారు. ఉద్యోగులను తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు, ఫెసిలిటేషన్ కేంద్రాలు

నియోజకవర్గం	ఓటర్లు	ఫెసిలిటేషన్ సెంటర్
సిర్పూర్	1,401	కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయం
ఆసిఫాబాద్	2,420	ఆసిఫాబాద్ ఆర్డీవో కార్యాలయం
ఖానాపూర్	1,952	ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయం
ఆదిలాబాద్	3,350	ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్
బోథ్	1,564	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బోథ్
నిర్మల్	2,961	నిర్మల్ ఆర్డీవో కార్యాలయం
ముథోల్	1,645	భైంసా ఆర్డీవో కార్యాలయం

వృద్ధులు, దివ్యాంగులు.. హోంపోలింగ్ దరఖాస్తుల వివరాలు

నియోజకవర్గం	85ఏళ్లు పైబడినవారు	దరఖాస్తులు	దివ్యాంగులు	దరఖాస్తులు
సిర్పూర్	1,613	74	4,051	53
ఆసిఫాబాద్	1,022	08	2,880	21
ఖానాపూర్	1,015	76	3,437	119
ఆదిలాబాద్	898	245	2,574	232
బోథ్	1,004	171	3,994	152
నిర్మల్	1,291	43	4,328	124
ముథోల్	1,705	113	4,440	152

న్యూస్‌రీల్

హజ్‌యాత్రికులకు వైద్యశిబిరం


యాత్రికుడికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో హజ్ సొసైటీ ఆధ్వర్యంలో యాత్రికుల కోసం గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ హాజరై మాట్లాడారు. జిల్లా నుంచి యాత్రకు వెళ్తున్న 63 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. యాత్రకు వెళ్లేవారికి ఆరోగ్య సూత్రాలు వివరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్, హజ్ సొసైటీ అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, మహ్మద్ హఫీజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

16లోపు ఫీజు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు ఈనెల 16లోపు చెల్లించాలని జిల్లా విద్యాధికారి ప్రణీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఎదురుచూడకుండా ఫీజు చెల్లించాలని సూచించారు. ఆరు సబ్జెక్టుల్లో ఫెయిలైనవారు రూ.125, మూడు అంతకన్నా తక్కువ సబ్జెక్టుల్లో ఫెయిలైనవారు రూ.110 చెల్లించాలని తెలిపారు. జూన్ 3నుంచి 11వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

కలెక్టర్ రాజర్షిషాకు ఓటరు స్లిప్ అందజేత


కలెక్టర్‌కు ఓటర్‌స్లిప్ ఇస్తున్న తహసీల్దార్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో గల పోలింగ్ కేంద్రం -261లో కలెక్టర్ రాజర్షి షా ఓటరుగా పేరు నమోదు చేసుకున్నారు. అతడి పేరిట వచ్చిన ఓటర్ స్లిప్‌ను ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్, ఆర్‌ఐ యుజువేందర్‌రెడ్డి, బీఎల్వో నివేదిత తదితరులు గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌కు అందజేశారు.

నేడు సీపీఐ బహిరంగసభ


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్స్‌లో శుక్రవారం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉదయం 10.30 గంటలకు బహిరంగ సభ ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్, కాంగ్రెస్ తరఫున జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ముడుపు నళినీరెడ్డి, కుంటాల రాములు, ఎస్.అరుణ్‌కుమార్, అమీనా బేగం, షబానా తదితరులున్నారు.

పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఈఈగా వెంకట్‌రావు

కైలాస్‌నగర్: పంచాయతీ రాజ్ ఆదిలాబాద్ జిల్లా ఈఈగా పనిచేసిన మహవీర్ గత నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో మరొకరు రాకపోవడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్‌ఈగా పనిచేస్తున్న జాదవ్ వెంకట్ రావుకు ఇన్‌చార్జి ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రాగానే బాధ్యతలు స్వీకరించారు.

క్లుప్తంగా

దుబాయ్‌లో మేడే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కార్మికులు

ఖానాపూర్: ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన జిల్లాకు చెందిన పలువురు కార్మికులు బుధవారం రాత్రి అక్కడ మేడే వేడుకలు జరుపుకున్నారు. ప్రపంచ కార్మిక వర్గానికి హక్కులు సాధించి పెట్టిన రోజు మేడే అన్నారు. చికాగో అమరుల పోరాట ఫలితంగా కార్మిక వర్గం 8 గంటల పనివిధానం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వాసులు పవన్‌సాయి, రాకేష్, చందు, రాము, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల రివైజ్డ్ షెడ్యూల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కళాశాలల్లో ఈ నెల 6 నుంచి బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ బీఏ (ఎల్) రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షలు, ఈ నెల 7 నుంచి నాలుగో సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు పరీక్షల రివైజ్డ్ టైంటేబుల్‌ను విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి గురువారం తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 6, 8, 10, 16, 18, 21, 25, 29వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 7, 9, 15, 17, 20, 22, 28, 30 వ తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 6, 8, 10, 16, 18, 21, 25, 29, 31, జూన్ 7, 11, 12, 13వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

పొన్నారిలో జొన్నచేను దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తాంసి: మండలంలోని పొన్నారిలో జరిగిన అగ్నిప్రమాదంలో జొన్నపంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు గంగయ్య తన ఏడెకరాల్లో జొన్నచేను కోసి నూర్పిడి చేసి పంటను ఆరబెట్టాడు. గురువారం మధ్యాహ్నం పక్క చేనుకు చెందిన రైతు తన పంటచేనులో వ్యర్థాలకు నిప్పుపెట్టాడు. గాలికి నిప్పురవ్వలు ఎగిసిపడి గంగయ్య చేనులో మిగిలి ఉన్న జొన్నకర్రలపై పడింది. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన రైతులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. సకాలంలో స్పందించకపోతే పంటచేనులో ఆరబెట్టిన జొన్న పంటకు మంటలు వ్యాపించి రైతుకు భారీ నష్టం జరిగి ఉండేది.

సిలిండర్‌లోంచి మంటలు

ఖానాపూర్: వంటగ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రితో పాటు ఇల్లు స్వల్పంగా దగ్ధమైన సంఘటన మండలంలోని సుర్జాపూర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తోకల రాజమల్లు ఇంట్లో గురువారం వంట చేస్తుండగా ఒక్కసారిగా సిలిండర్‌లోంచి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో ఎస్ఎఫ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది శంకర్, దిలీప్ సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.లక్ష విలువైన సామగ్రితో పాటు ఇల్లు దగ్ధమైంది.

కూలర్లకు గిరాకీ ఫుల్..

- వేడి నుంచి ఉపశమనానికి కొనుగోళ్లు
- మిడిల్‌క్లాస్ వారి చూపు కూలర్లవైపు..
- ఉన్నతవర్గాల వారికి ఏసీలపై ఆసక్తి



జిల్లా కేంద్రంలోని ఓ దుకాణం ముందు కూలర్లు

నిర్మల్‌ఖిల్లా: సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఉదయం 9 గంటల నుండే ప్రతాపం చూపిస్తున్నాడు. ఇక మధ్యాహ్నమైతే నిప్పుల కుంపటిలో ఉన్నట్లే ఉంటోంది. ఉష్ణోగ్రతలు పట్టపగలు జిల్లాలో దాదాపు 45 డిగ్రీలవరకు నమోదవుతుండగా రాత్రిపూట కూడా గరిష్ఠ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. దీంతో ఉక్కపోతతో జనం సతమతమవుతున్నారు. వారంరోజులుగా ఒక్కసారిగా ఉక్కపోత పెరిగింది. పిల్లలు, వృద్ధులు వేడికి తట్టుకోలేకపోతున్నారు. రాత్రిపూట ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కూలర్లు, ఏసీలు కొనుగోలు చేస్తున్నారు.

గిరాకీ ఫుల్...

జిల్లా కేంద్రంలోని పలు ఎలక్ట్రానిక్ దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపిస్తోంది. వినియోగదారులను ఆకర్షించేందుకు వ్యాపారులు దుకాణాల ముందు వివిధ డిజైన్లలో ఉన్న కూలర్లను డిస్‌ప్లే చేస్తున్నారు. స్థానికంగా తయారుచేసిన ఇనుపకూలర్లు రకరకాల డిజైన్లలో కెపాసిటీ, మోడల్‌ను బట్టి అందుబాటులో ఉంటున్నాయి. కంపెనీ కూలర్లు రూ.9వేల నుంచి ఉంటున్నాయి. జిల్లా కేంద్రం సమీపంలోనే తయారవుతున్న లోకల్ బ్రాండ్స్ రూ.ఐదారు వేలలోపే దొరుకుతున్నాయి. మరికొందరు గతేడాది కొన్న పాతకూలర్లకు గడ్డి, పంపులు వేయించడం చేస్తున్నారు. కూలర్లు రిపేర్లు చేసే వారికి కూడా చేతినిండా పనిదొరుకుతోంది. జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు కూలర్లు కొనేందుకు వస్తుండడంతో దుకాణాలు, రిపేర్ సెంటర్ల వద్ద రద్దీ కనిపిస్తోంది.

ఉష్ణతాపం నుంచి ఉపశమనానికే...

మేలో సూర్యుడు మరింత ప్రతాపాన్ని చూపేలా ఉన్నాడు. ఎండలు పెరగడంతో జనాలు ఇల్లు దాటి బయటకు రాలేకపోతున్నారు. రాత్రివేళల్లోనూ ఇంట్లో కూలర్ తప్పనిసరి అయ్యింది. ఆర్థికంగా ఏమాత్రం వెసులుబాటు ఉన్నా ఏసీలు కొనేందుకు ఎక్కువ మంది ప్రయత్నిస్తున్నారు. అల్పాదాయ వర్గాల వారంతా కూలర్లవైపు మొగ్గు చూపుతున్నారు. గతేడాదితో పోలిస్తే 15 నుంచి 20 శాతం కూలర్ల అమ్మకాలు పెరిగేలా ఉన్నాయని దుకాణ దారులు చెబుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్లకు గిరాకీ పెరిగింది. వ్యాపార వాణిజ్య దుకాణాల్లో గతంలో ఫ్యాన్లు నడిచేవి. ఉష్ణోగ్రతలు పెరగడంతో దుకాణాలు, సూపర్ మార్కెట్లలోనూ కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. ఉష్ణోగ్రతలతో పాటు విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరుగుతోంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు, ఐసోలేటర్లపై తీవ్రభారం పడుతోందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

గిరాకీ పెరిగింది



ఎండలు విపరీతంగా ఉండడంతో ఇళ్లలో ఉండేవారు కూడా చల్లదనం కోరుకుంటున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం పగలు, రాత్రి తేడా లేకుండా కూలర్లు వాడుతున్నారు. మార్కెట్లో వివిధ రకాల కూలర్లను అందుబాటులో ఉంచుతున్నాం. గతంలో కంటే కూలర్ల అమ్మకాలు పెరిగాయి. ఈ సీజన్లో వ్యాపారం ఆశాజనకంగా ఉంది.

– బండి సాయినాథ్, షాపు యజమాని, నిర్మల్

కొత్త కూలర్ కొన్నా...



ఈ వేసవిలో ఎండలు గతంలో కంటే మరీ ఎక్కువయ్యాయి. భరించలేని వేడి ఉంటోంది. పాత కూలర్ పాడు కావడంతో ఈ సీజన్లో కొత్త కూలర్ కొనుగోలు చేశా. ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుండడంతో ఇంట్లో నుండి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇంట్లో కూడా ఉక్కపోత నుండి ఉపశమనం కోసం కూలర్ వినియోగిస్తున్నాం.

– ఆకుల భూమేష్, ఈద్‌గాం, నిర్మల్

360 డిగ్రీల నిఘా...



ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసే దిశగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సీ విజిల్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా నగదు, మద్యం తరలింపుతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు అందితే తక్షణం స్పందించేలా ఎఫ్ఎస్‌టీ టీంలను ఏర్పాటు చేసింది. ఈ టీం వాహనాలపై 360 డిగ్రీల కెమెరాను అమర్చుకుని తమకు కేటాయించిన ప్రాంతాల్లో తిరుగుతూ విధులు నిర్వహిస్తూ నిరంతరం నిఘా ఉంచుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నాగాపూర్‌ను సందర్శించిన అధికారులు

సాక్షి స్పందన



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

బోథ్: 'బావినీరే.. తాగునీరు' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. గురువారం బోథ్ ఎంపీడీవో రమేశ్, ఎంపీవో మహేందర్ రెడ్డి, గ్రామీణ నీటిపారుదల శాఖ డీఈ దేవయ్య, ఏఈ కళ్యాణ చక్రవర్తి గ్రామాన్ని సందర్శించారు. బావితో పాటు చేతిపంపులు, నీటి కుళాయిలను పరిశీలించి గ్రామంలో నీటి కొరతను రానివ్వమన్నారు. గ్రామం మధ్యలో ఉన్న ట్యాంకులో మోటారు ద్వారా నీటిని నింపి గ్రామస్తులకు సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటే ట్యాంకరు ద్వారా నీరు అందిస్తామని ఎంపీడీవో అన్నారు. గ్రామంలో నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు.

ఎండలతో ఆయిల్‌పాం తోటలు జాగ్రత్త



తోటను పరిశీలిస్తున్న అధికారి సుప్రజ

వేమనపల్లి: పెరుగుతున్న ఎండల వేడిని దృష్టిలో ఉంచుకుని ఆయిల్‌పాం తోటలకు నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించాలని బెల్లంపల్లి క్లస్టర్ ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు జిల్లెడలో సాగులో ఉన్న తోటలను పరిశీలించారు. డ్రిప్ పద్ధతిలో రోజుకు మైక్రోజెక్ సహాయంతో 150 నుంచి 165 లీటర్ల నీటిని ప్రతి మొక్కకు అందించాలన్నారు. మొక్క ఎదిగిన తర్వాత 250 నుంచి 330 లీటర్ల నీటిని అందించాలన్నారు. మూడేళ్ల వరకు ఆడ, మగ పూగుత్తులను తీసివేయాలన్నారు. తద్వారా పుష్పగుచ్చాలు పోషకాలను నిలుపుకొని మొక్క ఏపుగా పెరుగుతుందన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

గుడిహత్నూర్: మండలంలోని మచ్చాపూర్ సమీపంలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ వివరాలు వెల్లడించారు. మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన రైతు నైతం కృష్ణ తన చేనులో జొన్న పంటలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నాడు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా 207 గంజాయి మొక్కలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి సాగు చేసిన రైతుకు రైతు బంధు, రైతు భీమా వర్తించవన్నారు. గంజాయి కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్సై సయ్యద్ ఇమ్రాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై నరేష్

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో అక్రమ మద్యం నిల్వ ఉన్నట్లు పక్క సమాచారంతో గురువారం ఠాకూర్ మాదవ్‌సింగ్ ఇంటి వద్ద తనిఖీలు చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.68 వేల విలువైన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మండలంలో బెల్టు షాపులు నిర్వహించినా అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని పలు బెల్టుషాపులపై గురువారం ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా టగ్రే లలిత కిరాణ షాపులో రూ.5,250 విలువైన మద్యం బాటిళ్లు దొరకడంతో వాటిని స్వాధీనం చేసుకుని దుకాణం నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా



రహదారిపై బోల్తాపడిన కంటైనర్

నేరడిగొండ: మండలంలోని లింగట్ల జాతీయ రహదారిపై గురువారం ఉదయం కంటైనర్ బోల్తా పడింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కంటైనర్ అదుపు తప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై పడడంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. వెంటనే ఎన్‌హెచ్ఏఐ అధికారులు క్రేన్ సహాయంతో కంటైనర్‌ను పక్కకు తీశారు. దీంతో రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.

వడదెబ్బతో ఒకరి మృతి

బెజ్జూర్: మండలంలోని గబ్బాయి గ్రామానికి చెందిన పోర్ల టి శ్రీనివాస్(40) గురువారం వడదెబ్బతో మృతి చెందాడు. రెండు రోజుల క్రితం దహెగాం మండలంలోని పోలంపల్లిలో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. ఈ క్రమంలో వాంతులు, విరేచనాలు కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య జానాబాయి, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని రాజేశ్వర్‌రావుపల్లెలో గురువారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి రూ.6,100 నగదు, రెండు పేకాట సెట్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో గడ్డం రవీందర్‌రెడ్డి, మారు వెంకటరెడ్డి, సీపెల్లి మొగిళి, గాడిపెల్లి సురేందర్, ఎనగందుల వెంకటేశ్, ఎనగందుల నందయ్య ఉన్నారు.

యువకుడిపై కేసు నమోదు

తాండూర్: అన్నదమ్ములను దూషించడమే కాకుండా వారిపై చేయి చేసుకున్న ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు మాదారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన మడికంటి శ్రావణ్, సన్నాయిల రాజు గురువారం ఉదయం ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్లారు. అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తనతో గొడవ పెట్టుకున్న శ్రావణ్‌ను చితగ్గొట్టాలనే ఉద్దేశంతో రాజు అతని ఇంటికి వెళ్లి బూతులు తిట్టాడు. అతని అన్న మడికంటి సతీష్ అక్కడికి వెళ్లి ఎందుకు తిడుతున్నావని అడిగాడు. కోపంతో ఊగిపోయిన రాజు సతీష్‌ను సైతం కొట్టి దుస్తులు చించేశాడు. బాధితుల ఫిర్యాదుతో నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు లారీలు ఢీ.. తప్పిన ప్రమాదం

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి రెండు లారీ లు ఢీకొన్నాయి. జైపూర్ పవర్ ప్లాంటు నుంచి మంచిర్యాల వైపు బూడిద లోడ్‌తో వెళ్తున్న లారీని మంచిర్యాల నుంచి గోదా వరిఖని వైపు వెళ్తున్న మరో లారీ క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి ఢీకొట్టింది. లారీ లు బలంగా ఢీకొన్నప్పటికీ డ్రైవర్లకు ఎ లాంటి గాయాలు కాలేదు. పెద్ద ప్రమాదం తప్పిందని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

అక్రమ దందాలకు అడ్డా!

భైంసా పట్టణం అక్రమ దందాలకు కేంద్రంగా మారిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. క్రికెట్ బెట్టింగ్, మట్కా, జూదం నిర్వహణ యథేచ్ఛగా సాగుతుండగా, గంజాయి విక్రయం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, ఇసుక అక్రమదందా సైతం జోరుగానే సాగుతోంది. పట్టణంలోని థియేటర్ రోడ్డులో పేరొందిన ఓ బిర్యానీ పాయింట్ ఉంది. దాదాపు అందరికీ సుపరిచితమే. ఇక్కడి నుంచి పోలీసు సిబ్బంది కొందరు ఆహార పొట్లాలు కూడా తీసుకెళ్తుంటారు. అయితే, ఇది పైకి మాత్రమే హోటల్.. కానీ, దీని నిర్వాహకుడు ఒకరు క్రికెట్ బెట్టింగ్, మట్కా నిర్వహిస్తాడన్నది బహిరంగ రహస్యం. కొందరు సామాజిక సేవ ముసుగులో పెద్దల మధ్య తిరుగుతూ మట్కా, బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. అయినా, స్థానిక పోలీసు అధికారులకు ఈ విషయం తెలియడం లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- యథేచ్ఛగా మట్కా, బెట్టింగ్ నిర్వహణ
- గుప్పుమంటున్న గంజాయి
- సైబర్ నేరం కేసులో భైంసా యువకుడి అరెస్ట్



భైంసాటౌన్: సున్నిత ప్రాంతంగా భైంసా పట్టణానికి రాష్ట్రస్థాయిలో పేరుంది. గతంలో ఇక్కడ చోటుచేసుకున్న అల్లర్ల ఘటనల నేపథ్యంలో ఏ ఉత్సవం జరిగినా ఇప్పటికీ భారీగా పోలీసు బందోబస్తు మోహరించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో బయటిప్రాంత ప్రజలకు భైంసా అంటేనే అమ్మో అనే పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు. మరోవైపు మట్కా, క్రికెట్ బెట్టింగ్, గంజాయి విక్రయాలు, పీడీఎస్ బియ్యం అక్రమరవాణా వంటి దందాలతో పట్టణం పేరు మరింత అభాసుపాలవుతోంది. ఇటీవల గంజాయి విక్రయాలపై దృష్టిసారించిన పోలీసు యంత్రాంగం ఇప్పటివరకు నలుగురు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేయగా, కిలోన్నర వరకు పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇక, ఇటీవల నిర్మల్‌లో ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడుతూ ఇద్దరు అరెస్ట్ కాగా, వారికి ఐడీలు క్రియేట్ చేసింది భైంసాకు చెందిన వ్యక్తిగా తేలింది. దీనికితోడు పేదలకు అందస్తున్న పీడీఎస్ బియ్యం సైతం యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తూ పలుమార్లు పట్టుబడిన సందర్భాలున్నాయి.

ఇంకా మరెన్నో...

ఇవేకాకుండా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జోరుగానే సాగుతోంది. పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి ఏకంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని బియ్యం సేకరిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక, మహారాష్ట్ర నుంచి పట్టణానికి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. స్థానిక యువత మత్తుకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మద్యం దుకాణాల నిర్వాహకులు కొందరు ఉదయం 6 గంటల నుంచే మద్యం విక్రయాలు చేస్తున్నారు. పర్మిట్ రూముల్లో మద్యం నిల్వ చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. విచ్చలవిడి మద్యం విక్రయాలతో కొందరు మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పోలీసు అధికారులు, నిఘా విభాగం సిబ్బంది, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అక్రమదందాలకు అడ్డుకట్ట వేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మచ్చుకు కొన్ని...

గతంలో కొన్ని సంఘటనలు పరిశీలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం లేకుండా ఇతర ప్రాంత పోలీసు అధికారులు, బృందాలు ఆకస్మిక తనిఖీలు జరిపి అనుమానితులు, నిందితులను అరెస్ట్ చేసిన సందర్భాలు ఉన్నాయి.

- 2022లో ఎన్ఐఏ అధికారుల బృందం పట్టణంలోని మదీనాకాలనీలో అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించింది. కీలక పత్రాలు, ల్యాప్ టాప్, హార్డ్‌డిస్క్ స్వాధీనం చేసుకుంది. నిషేధిత సంస్థ పీఎఫ్ఐతో సంబంధాలున్నాయన్న అనుమానంతో ఇద్దరిని విచారణ నిమిత్తం తరలించారు.
- ఇటీవల ఐపీఎల్ బెట్టింగ్ కేసులో జిల్లా కేంద్రంలో ఇద్దరిని అక్కడి పోలీసులు అరెస్ట్ చేయగా, వారికి ఐడీలు క్రియేట్ చేసింది భైంసాకు చెందిన రహమాన్‌గా గుర్తించారు.
- తాజాగా సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు సమకూర్చుతున్న కేసులో పట్టణానికి చెందిన షిండే ప్రణయ్ అనే యువకుడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసు అధికారులతోపాటు ఇతర నిఘా విభాగాలు ముందస్తుగా నేరస్థులను గుర్తించడం, నేరాలు అరికట్టడంలో విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం..

బెట్టింగ్ కేసులకు సంబంధించి స్థానికంగా ఫిర్యాదులు లేకపోవడంతో ఇలాంటి ఘటనలు మా దృష్టికి రావడం లేదు. మట్కా, గంజాయి విక్రయాలపై దృష్టి సారించాం. మట్కా నిర్వాహకులపై కేసులు కూడా నమోదు చేశాం. కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారిని గుర్తించే పనిలో ఉన్నాం. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం.

– డి.రాజారెడ్డి, పట్టణ సీఐ, భైంసా

నగదు పట్టివేత



నగదు అప్పగిస్తున్న పోలీసులు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.98 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా కరీంనగర్‌కు చెందిన ఎండీ అక్రం వద్ద రూ.98 వేల నగదు లభించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసి ఎస్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లరాదని సూచించారు.

హత్య కేసులో ఆరుగురికి జీవితఖైదు

వాంకిడి: మండలంలోని ఖిరిడి గ్రామంలో జరిగిన హత్య కేసులో ఆరుగురికి జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.వీ రమేశ్ గురువారం తీర్పునిచ్చినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. భూతగాదాలో 2019 జూన్ 21న తొడసం బొజ్జి రావు, సెడ్మకె గంగారాం, సెడ్మకె తెలంగ్‌రావు, సెడ్మకె యశ్వంత్‌రావు, సెడ్మకె జంగు, తొడసం శారద ఖిరిడి గ్రామానికి చెందిన రాయిసిడాం శ్యాంరావు(52), తారాబాయి(45) దంపతులను గ్రామ శివారులో గొడ్డళ్లతో నరికి హత్య చేశారు. మృతుల కుమారుడు రాయిసిడాం విలాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి సీఐ రాణాప్రతాప్ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుత సీఐ శ్రీనివాస్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జీవిత ఖైదుతో పాటు రూ.15 వేల చొప్పున జరిమానా విధించారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కమిషనర్

భీమిని: ఉపాధిహామీ కూలీలకు మెరుగైన వసతులు కల్పించాలని రాష్ట్ర జాయింట్ కమిషనర్ నర్సింహులు అన్నారు. గురువారం కన్నెపల్లి మండలం టేకులపల్లి, జజ్జరవెల్లి గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనికి తగిన వేతనం వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. వసతులపై ఆరా తీశారు. పనుల వద్ద టెంట్, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మంచినీరు తక్కువగా కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేట్ ప్రాజెక్టు మేనేజర్లు మురళి, రఘువీర్, డీఆర్‌డీఓ కిషన్, అడిషనల్ డీఆర్‌డీఓ దత్తరావు, ఎంపీడీఓ పాల్గొన్నారు.